# గుడ్డోడు

‘‘గుడ్డోడి అసలు పేరేంటి?’’ అడిగేడు మట్టపర్తిసూరయ్య.

‘‘ఏమో నాకు తెల్సినప్పట్నుంచీ ఆడిపేరు గుడ్డోడే... వూరోళ్ళంతా అలాగే పిలుస్తారా ముసలోడ్ని’’ అన్నాడు పోస్టుమేన్ సూర్నాణ.

‘‘అసలా ముసిలోడు ఎవరి తాలూకు?’’మళ్ళీ అడిగేడు సూరయ్య.

‘‘అసలాడి గురించి ఎందుకూ అంత ఇదిగా మాటాడుకుంటున్నారు’’ అన్నాడు నందుసత్యం.

నవ్వేసిన సూరయ్య ‘‘ఏదోలేకుండా ఎందుకు మాటాడుకుంటాం’’ అన్నాడు.

అంతసేపూ ఎర్రకంకరమట్టిలో కొట్టుకుపోయిన నల్లకోడిపిల్ల నూలు వీర్రాజుగారింటి ముందు మందారం చెట్టునీడలోకి దూరిపోయింది. లైబ్రరీ మేష్టారింటి దడికి పండు మిరపరంగు చీర ఆరేసి ఉంటే రాజేశ్వరస్వామి గుడి గోపురం మీద చిలక ఆ చీర మీద వాలింది. పూసలూ వెంట్రుకల్తో అల్లిన దండల్లోవెళ్తున్న బక్కచిక్కిన చెంచు మనిషిచంకలో ఉన్నకుర్రోడు ఆ మనిషిరొమ్ము గీరుతున్నాడు. కుందయ్యసారాకొట్టు పక్కన ఆవు పడుకుని ఉంటే దాన్ని ఆన్చి కూర్చున్న లేగదూడ నాలికి చాపి తల్లి తలని నాకుతుంది. గొల్లలతూము దగ్గరున్న వెలగచెట్టు కింద పడుకున్న రెండు గేదెలు అందంగా నెమరేస్తున్నాయి.

మట్టపర్తిసూరయ్య మరి చెప్పడం మొదలెట్టేడు...

* * *

కోరివెంకయ్యది ఉమ్మడికుటుంబం భార్య పేరు వరాలమ్మ. పెద్దకొడుకు రంగారెడ్డి బళ్ళ మేస్త్రి, రెండోకొడుకు తమ్మిరెడ్డి పాలవ్యాపారం చేస్తుంటాడు మూడోకొడుకు సద్గురురెడ్డి తాపీ మేస్త్రి. అందరికీ పెళ్ళిళ్ళయ్యినియ్యి. ఇంటి పెత్తనమంతా శేషయ్యభార్య వరహాలమ్మది.

తెల్లవారుఝామునే లేచి పుంతరేవులో స్నానం చేసి తడిబట్టల్తో గోపాలస్వామి గుళ్ళోకెళ్ళి రావడం చిన్నప్పట్నుంచీ అలవాటు కోరి వెంకయ్యకి. వరదగోదారి ఊళ్ళోకొచ్చి ముంచేస్తున్నా ఈదుకుంటా పుంతరేవు కెళ్ళిపోతాడు వెంకయ్య.

రాత్రినించి తుంపర్లు పడుతున్నాయి. నడుచుకుంటా పుంతరేవులో కెళ్ళిన వెంకయ్య ఒడ్డున స్నానం చేస్తున్న గుడ్డోడు పాకుడు

రాళ్ళమీద జారి పడిపోడం చూసి ఒడ్డుకి తీసుకొచ్చేడు. మోకాలు కొట్టుకుపోయింది. గుడ్డోడు ఏడుస్తున్నాడు రెండకరాలున్నాయి ఆటిని చూసుకునే వోడెవడు... ఆ మనిషిజూస్తే తొందరగా పైలోకానికెళ్ళిపోయింది పిల్లలు జూస్తే పెళ్ళిళ్ళయ్యేక ఆళ్ళదార్ని ఆళ్ళెళ్ళిపోయేరు. ఇంక ఈ పసలపూడిలో నాకు దిక్కెవరు'' అరవయ్యేళ్ళు దాటిన గుడ్డోడు అలా ఏడుస్తుంటే కడుపు తరుక్కుపోయింది వెంకయ్యకి. ''ఏనాడూ లేంది ఆవేళ పెద్దీధిలో ఉన్న గోపాలస్వామి గుడికెళ్ళడం మానేసి ఇలాంటోడికి సాయం చేస్తే ఆ దేవుడికి పూజ్జేసుకున్నట్టే'' అనుకుని గుడ్డోడ్ని నడిపించుకుంటా వూళ్ళోకి తీసుకొచ్చి మందులిచ్చే బడేసాయిబుగారి దగ్గరకి తీసుకొచ్చి కట్టుకట్టించి గుడ్డోడాళ్ళ పెంకుటిల్లు అరుగుమీద కూర్చోబెడ్తుంటే ''ఇదిగో కోరెంకయ్య బావా!'' అని పిల్చేడు గుడ్డోడు.

ఆగిన ఎంకయ్య ''ఏంటీ?'' అన్నాడు.

''నీకేమాత్రం పొలముంది?'' అడిగేడు గుడ్డోడు.

''పదిహేనెకరాలు'' చెప్పేడు వెంకయ్య.

''ఎవడికీ కౌలుకివ్వకుండా నువ్వే పండించుకుంటున్నావు గదా ఎంకయ్యబావా?''

''అవునూ ఏం?''

''పిల్లంతా పట్టుకుపోగా నాకో మూడుకుంచాల మాగాణీ మిగిలింది వెంకయ్యబావా..దాన్ని నే చేసేకోలేకపోతున్నాను. నీ పొలంతో పాటు నా పొలంకూడా నువ్వు చేసి పెట్టాలి'' అన్నాడు ముసలిగుడ్డోడు.

ఆలోచించుకున్న కోరి వెంకయ్య ''అలాగేలే పండిన పంట పండినట్టు నీకుపోస్తాను'' అన్నాడు.


చాలా సంబర పడిపోయిన గుడ్డోడు ''ఈ వయసులో ఉడకేసుకుతినడం కనాకష్టమైపోతుంది. మీ ఇంటెనక గాదులసావిట్లో ఉంటాను. తెల్లారితే ఎంతమందికో తన చేత్తో పెట్టే మా వరాలమ్మని నాకింత కంచంలో వెయ్యమని చెప్పుబావా!'' అన్నాడు.


జేవురించుకుపోయిన ముఖంతో గుడ్డోడు అలా అడుగుతుంటే ''కాదు... కాదెహే'' అన్లేకపోయేడు వెంకయ్య. ''సర్లే ఇంటికొచ్చెయ్యి'' ఆ పాటిమట్టి అరుగుమీద చతికిలబడిపోయేడు.

* * *

వరాలమ్మ వంట మా గొప్పగా వుంటుంది. గాదులసావిట్లో మకాం పెట్టిన గుడ్డోడు ''వరాలమ్మా..మా చెల్లెమ్మా'' అంటా తెగ పొగుడుతా వారం రోజుల్లో మచ్చిక చేసేసుకున్నాడు.

దీపాలవేళదాటేకా దొడ్లో పొయ్యిమీద వంకాయి ముక్కల్ని సన్నగా తరిగి ఎండుచేపల ఇగురు వండుతున్న వరాలమ్మ దగ్గరకి జేరి ''యానం నించి గోదారి గట్టునే కొన్ని మైళ్ళెళ్ళి దరియాలతిప్ప అని ఒక ఊరొస్తది అది కుడిపక్కకి మళ్ళితే బైరవపాలెం అని ఒక ఊరు తగులుద్ది చెల్లీ... ఆ వూరోళ్ళందరికీ చేపలు పట్టేపనే అంతా మరకాళ్ళు.





ఎండిచేపలు తినాలంటే ఆ వూరి ఎండు చేపలు తినాలమ్మా!'' అంటూ చెప్పుకు పోతున్నాడు.

గుడ్డోడి మాటవింటా కర్ర తెడ్డితో కూర కలబెడ్తున్న వరాలమ్మ ముగ్గురు కోడళ్ళనీ, పిల్చి వాళ్ళ అరచేతుల్తో తెడ్డుతో కూర కొంచెం ఇదిపి ''ఉప్పు చూడండి'' అంది.

''చూసిన కోడళ్ళంతా సరిపోయిందన్నారు. నువ్వు కూడా చూడు అన్నయ్యా'' అని గుడ్డోడి అరచేతిలో వేసేసరికి వేడిగా ఉన్న ఆ ఇగురు ఊర్పుకి చెయ్యి కాలింది ఒణికిపోతున్న చేతిని అటూ ఇటూ కదుపుతానే నాలిక సుతతో లాగి మొత్తం నాకేసిన గుడ్డోడు ''సప్పగా ఉంది కొంచెం పడద్దమ్మా

ఉప్పు'' అన్నాడు.

ఎందుకో గుడ్డోడి మాట ప్రకారం ఓ గుప్పెడు ఉప్పు ఇగురులో వేసింది వరాలమ్మ.

ఇంటిల్లపాదీ ఒకేసారి మండువా లోగిట్లో అన్నాలు తినడం అలవాటు. ఆవేళ అన్నం తిన్న ఇంటిల్లపాదీ ''ఎప్పుడూ లేనంత రుచిగా ఉంది ఎండుచేపల ఇగురు. ఉప్పు సరిగ్గా సరిపోయింది'' అన్నారు.

ఇక ఆరోజు నించీ ఏవంట చేసినా ముందు గుడ్డోడికి రుచి చూపించిగానీ దాకని పొయ్యిమీంచి దింపేదిగాదు వరాలమ్మ.

''చెల్లెమ్మా చెల్లెమ్మా'' అంటా వరాలమ్మకి చాలా దగ్గరైపోయిన గుడ్డోడు తేలు కుడితే కాటు మీద ఎలాంటి పసరు మందేస్తారో చెప్పేడు, దెయ్యం పడితే పురాతన వడిశలేరు భూతవైద్యం ఎలా చేస్తారో చెప్పేడు. వరాలమ్మ ఊళ్ళో కూలోళ్ళకీ సాలోళ్ళకి వడ్డీకి డబ్బులిచ్చి వసూళ్ళకి వెళ్తద్ది. ఒక రోజలా వెళ్తున్న వరాలమ్మని ఆపిన గుడ్డోడు ''అమ్మా సెల్లమ్మా...ఇవ్వేళ మంగళవారం గదా'' అంటే ''కుజుడు ఆ గ్రహానికిష్టమైన ఎరుపురంగు చీర కట్టుకెళ్ళు నీకంతా జయమవుద్ది'' అన్నాడు. ఎందుకన్నాడో అని గుడ్డోడు చెప్పినట్టే చేసింది వరాలమ్మ. విచిత్రం రావనుకున్న పారుబాకీలు కూడా వసూలయి పోయినియ్యి. అంతే ఇక అక్కడ్నించి గుడ్డోడ్ని అడక్కండా ఏ బట్టా కట్టేది కాదు. ఏరోజు ఆ నక్షత్రాని కిష్టమైన బట్ట కట్టాలో గుడ్డోడే చెప్పేవాడు. ఆ ముసలోడు చెప్పినట్టు నడుచుకుంటా ఆడ్ని అడక్కుండా ఏ పనీ చేసేది కాదు వరాలమ్మ. గుడ్డోడు ఏం చెపితే అది వేదం వరాలమ్మకి.

అలా కొన్నాళ్ళకి ఆ ఇంట్లో మారాజైకూర్చున్నాడు గుడ్డోడు.

* * *

పండగనెల పట్టేరు. చలి బాగా ముదిరింది. ఇంకా తెల్లారలేదు. వీధుల్నిండా ఒకటే మంచు. ఆ మంచులోనే ఆడోళ్ళంతా గుమ్మాలముందు రథం ముగ్గులేస్తుంటే వాళ్ళ పిల్లలు గళ్ళ దుప్పట్లు కప్పుకుని లాంతర్లు పట్టుకునే అరుగులమీద కునుకు పాట్లు పడ్తున్నారు. ఇంటిముందు పాచి చేసి కళ్ళాపిజల్లి చుక్కలు పెడ్తున్న వరాలమ్మ దగ్గరకి కర్ర పోటేస్తా వచ్చి నిలబడ్డ గుడ్డోడు ''చెల్లమ్మా! నీతో రెండు ముక్కలు మాటాడాలి'' అన్నాడు.

వేస్తున్న ముగ్గులు ఆపి ఆత్రంగా గుడ్డోడి దగ్గర కొచ్చిన వరాలమ్మ ''ఏంటన్నయ్యా?'' అంది.

''ఏం లేదమ్మా ఇంట్లో డబ్బులు పెత్తనం ఎవరికప్పగించేవు?'' అడిగేడు గుడ్డోడు.

''పెద్దకోడలికి ఎందుకూ?'' అంది వరాలమ్మ.

''చెప్తాను... వంటపని ఎవరికప్పగించేవు?'' మళ్ళీ అడిగేడు.

''రెండో కోడలికి'' అంది వరాలమ్మ.

''ఇంటి పన్లన్నీ చూసే పని?''

''మూడోకోడలు పిల్లుందిగా దాని కప్పగించేను... ఏం?'' అనడిగింది వరాలమ్మ.

''ఆళ్ళందరికీ అలాగ పెత్తనాలిచ్చేస్తే ఆనక గాదుల సావిట్లో నులకమంచమేసి అక్కడ పడుకోబెడతారు నిన్ను'' అని అర్తమూర్లోనూ, తొస్సిపూడిలోనూ వెనకటికి జరిగిన కొన్ని అత్తాకోడళ్ల కథలు గుండెలు కరిగి నీరయిపోయేలాగ చెప్పి చిట్టచివర్లో తనూ ఏడ్చేసేడు.

అంతే, ఆ మర్నాటినించీ కోడళ్ళకి ముగ్గురికీ అప్పగించిన మూడుపెత్తనాల్ని వెనక్కి లాగేసుకుంది.

ఒకరోజు మూడోకోడలు అత్తగారికి తెలీకండా పుల్లపెరుగు అమ్మి డబ్బులు తన మొల్లో దోపుకుందని చాలా పెద్ద గొడవే చేసింది వరాలమ్మ. ఆ గొడవకి కారణం గుడ్డోడు. పెద్ద కోడలు అత్తగారికి తెలీకండా ఉప్పుడు పిండి చేసుకుతింది దానికీ గొడవేసింది వరాలమ్మ. ఆ గొడవ చెయ్యడానికి కూడా కారణం గుడ్డోడే అత్తగారిలో ఈ తేడాతెచ్చిన ఈ ముసలి గుడ్డోడింకేం చేస్తాడో అనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకు బతుకుతున్నారు వాళ్ళు.

* * *

తల్లిమాట జవదాటని కొడుకుల పరిస్థితికూడా ఇలాగే ఉంది.

పెద్దకొడుకు రంగారెడ్డికి పేకాటపిచ్చి ఉంది. ఎప్పుడూ అబద్ధమాడని రంగారెడ్డి ఈ విషయంలో మట్టుకి పచ్చి అబద్ధాలాడి పొద్దోయేకా పిచ్చి తాతారెడ్డి కొట్లో అద్దె సైకిలు తీసుకుని గేలా పెత్తేసేవాడు.

అది తెల్సుకున్న గుడ్డోడు వెంకయ్యకీ వరాలమ్మకీ కూడా చెప్పేసేడు.

చాలా పెద్ద గొడవైంది.

గుడ్డోడు మీద పగబట్టిన రంగారెడ్డి వాడ్నేవన్నా చేద్దావని చాలా పన్నాగాలు పన్ని చివరికేమీ చెయ్యలేక తనలో తనే కుళ్ళి పోతున్నాడు.

ఇలాగ ఇంట్లో ప్రతివాళ్ళ గురించీ పెద్దోళ్లకీ చెప్పి ఆళ్ళకళ్లకి చాలా గొప్పోడయి పోతున్నాడు గుడ్డోడు. అటు పక్క చూస్తుంటే గొలుగూరి పోతారెడ్డి గారి కోడలు సంపర్తమ్మ గుడ్డోడ్ని వెంకయ్య గారింట్లోంచి గెంటెయ్యడానికి చాలా అయిడియాలు చెప్తుంది కోరివెంకయ్య కోడళ్ళకి.

* * *

కోరివెంకయ్యగారి దొడ్డి వెనక ఇల్లు గొలుగూరి పోతారెడ్డిగారిది. వాళ్ళదికూడా ఉమ్మడికుటుంబమే. ఆ ఇంట్లోకూడా కొడుకులూ కోడళ్ళ మధ్యలో పోతారెడ్డి వాళ్ళావిడ సుబ్బాలు పెత్తనం చేస్తుంటారు. ఆ ఇంట్లో పెద్ద కోడలయిన సంపర్తమ్మ మధ్యాన్నాలప్పుడు కోరివెంకయ్యగారింటి అరుగుమీద కొచ్చి జుట్టు చిక్కులు తీసుకుంటున్న కోడళ్ళమధ్యలో చతికిలబడ్తుంది. ఆవేళ మిట్టమధ్యాన్నం వచ్చిన సంపర్తమ్మ "మీ ఇంట్లో మాకాం వెట్టిన ఆ గుడ్డోడు ఒక కుమ్మరి పురుగు లాంటోడు. ఆడ్ని టెంకిజెల్లకొట్టి పెందలాళే బయటికి తరిమెయ్యకపోతే చాలా ప్రెమాదం. కావాలంటే నేనూ సాయం చేస్తాను" అనడం మొదలెట్టింది.

కోడళ్ళకి కూడా సంపర్తమ్మ చెప్పేది చాలా సబబుగా అన్పిస్తుంది. ఆడిమీద పీకల్దాకా కసి పెరుగుతుంది తప్ప ఏం చెయ్యలేకపోతున్నారు.

పసలపూడిలో సంకురాత్రుళ్ళు వస్తున్నాయి వెళ్తున్నాయి. గోపాలస్వామిగుడి ప్రహరీగోడ పక్కనున్న పారిజాతం చెట్టు ప్రతిరాత్రీ, పూలు రాలుస్తానే ఉంది. రాజేశ్వరస్వామి గుళ్ళో ఎర్రగన్నేరు పూలూ, కరివేరపూలు పూచి రాలతానే ఉన్నాయి.

కాలం గడిచిపోతా ఉంది.

కోరివెంకయ్యకి గొంతు దగ్గర కాయలాంటిది కాసి బాగా ముదిరేక అది కేన్సరని తెల్సింది. ఆ తర్వాత పెద్దాస్పత్రికి తీసుకెళ్ళినా ఆర్నెల్లకంటే ఎక్కువ బతకలేదా మనిషి. అతను కాలం చేసిన కొన్నాళ్ళకి పెనిమిటి పోయేడన్న మనియాదతో బెంగెట్టుకుని మంచమెక్కిన వరాలమ్మకూడా ఒక అర్ధరాత్రి నిద్దట్లోనే కాలం చేసింది.

తల్లిని సాగనంపడానికి తూరుప్పేటవతల వెదురుపాక వెళ్ళే రోడ్డులో ఉన్న కాష్టాల దిబ్బదాకా వెళ్ళిన కొడుకులు ఇంటికొచ్చేక గుడ్డోడి కోసం వెతికేరు.

కనపడలేదు.

పెళ్ళాల్నడిగితే అత్తగారు పోయిన బెంగలో ఉన్న వాళ్ళు వీడి సంగతే మర్చిపోయేరట. ఇల్లంతా వెతికేరు.

ఎక్కడా కనపడలేదు గుడ్డోడు.

* * *

రెండు రోజులైంది.

కోరివెంకయ్యగారింటి కిటికీ వెనకనించి సూర్యుడు పైకి లేస్తున్నాడు. మేకపిల్ల మెళ్ళో తాడుగట్టి కబేళాకి లాక్కెళ్తున్నాడు కళింగసాయిబుకొడుకు. డొక్కు సైకిలు టైరు పేలిపోడంతో వల్కనైజింగు చేయించుకుందారని నడిపించుకెళ్తున్నాడు నాగమణిగారి బాచి. చంటమ్మగారి కోడలు నల్లగచ్చు అరుగులు కడిగి సుద్దముగ్గులు పెడ్తుంది. తూర్పుగాలి తిరగడంతో గోదారి కాలవమీద పడవ తెరచాప ఎత్తేరు.

అడ్డమైన గడ్డీ కరిపించిన ఆ గుడ్డోడ్ని మావూరి పొలిమేరల్నుంచి తరిమేద్దామని రెండు రోజులుగా వెతుకుతున్న కోరివెంకయ్య కొడుకులూ కోడళ్ళు అది చూసి ద్రాక్షారామం గుళ్ళో రాతిబొమ్మల్లా గుండిపోయేరు.

ఆదృశ్యమేంటంటేనండీ-

ఉమ్మడికుటుంబం గొలుగూరి పోతారెడ్డిగారి రెండు మండువాలలోగిట్లో ఆకివీడు నవారు మంచం మీద కూర్చున్న గుడ్డోడికి ఇత్తడిపళ్ళెంలో అటుకుల పులిహోర పెడ్తుంది సుబ్బాలు.

''పెరుగుంటే పట్రా అటుకుల పులేరంలో కలిపితే రుసిగా తింటాడు బావ'' అంటున్నాడు గొలుగూరి పోతారెడ్డి.

* * *